కొందరికే గ్యాస్‌ సబ్సిడీ

శాస్త్రిపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న గ్యాస్‌ నగదు బదిలీ రాజేంద్రనగర్‌ నియోజకవర్గంలో అస్తవ్యస్తంగా మారింది. చాలా మందికి ఖాతాల్లో నగదు జమా కావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సబ్సిడీ రావాలంటే ఆధార్‌కార్డుతో పాటు బ్యాంక్‌ వివరాలు ఇవ్వాలని ఏజెన్సీ నిర్వాహకులు సూచనల మేరకు ఎన్ని సార్లు ఇచ్చినా ఫలితం ఉండటం లేదని నియోజవకవర్గ వాసులు వాపోతున్నారు.

నేడు జ్యోతిరావు పూలే విగ్రహానికి పాలాభిషేకం

రాజేంద్రనగర్‌: బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ బిల్లుకు ఆమోదం తెలిసిన సీఎం, బిల్లుకు మద్దతు పలికిన అన్ని రాజకీయ పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ ఈ నెల 20న రాజేంద్రనగర్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల వద్ద మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి క్షీరాభిషేకం చేయనున్నట్లు వేముల రామకృష్ణ తెలిపారు. అసెంబ్లీలో బీసీ బిల్లు ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బీసీలకు విద్యా, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ప్రభుత్వం ప్రవేశపెట్టడం బీసీ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందడం హర్షణీయమన్నారు.

మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం


చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మణికొండ: మందకృష్ణ మాదిగ సుదీర్ఘకాలం చేసిన పోరాటం ఎట్టకేలకు ఫలించిందని ఎమ్మార్పీఎస్‌ గండిపేట మండల ఇన్‌చార్జి గణేష్‌మాదిగ అన్నారు. బుధవారం నార్సింగిలోని అంబేడ్కర్‌ విగ్రహం వద్ద మందకృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కృష్ణ మాదిగ అడుగు జాడల్లో 30 సంవత్సరాల పాటు నడిచిన మాదిగ నాయకులు, కార్యకర్తల విజయంగా అభివర్ణించారు. రాబోయే రోజుల్లో మాదిగ సమాజానికి మంచి రోజులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహా, కృష్ణమాదిగ, నరేందర్‌, రాజు, వేణు, రజినీకాంత్‌, శంకర్‌, బలరాం పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యవంతంగా ఉంటారని బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ బి.శరత్‌చంద్ర సూచించారు. బుధవారం కార్పొరేషన్‌ పరిధి 18వ డివిజన్‌లోని బీపీఎస్‌ కాలనీ, 19వ డివిజన్‌లోని అభ్యుదయనగర్‌ కాలనీ, 20వ డివిజన్‌లోని గాయత్రినగర్‌ కాలనీలలో డోర్‌ టూ డోర్‌ చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు జగన్‌మోహన్‌, యాదగిరి, సుభాష్‌, శ్రీధర్‌, రాము తదితరులున్నారు.

గో సంరక్షణకు చట్టాలు కావాలి

శంషాబాద్‌ రూరల్‌: గోవులను సంరక్షించే చట్టాలు కావాలని ఆవుల సంరక్షణ పాఠ్యాంశాల్లో భాగం కావాలని గో ప్రేమి, ప్రచారక్‌ శ్రద్ధే గోపాల్‌ సరస్వతీ దీదీజీ అన్నారు. మండలంలోని పెద్దషాపూర్‌ శివారులో ధ్యాన్‌ ఫౌండేషన్‌ నిర్వహిస్తున్న గోశాలను బుధవారం ఆమె సందర్శించి మాట్లాడారు. మన వేదాల్లో గో సంరక్షణను నొక్కి చెప్పబడిందన్నారు. ఆవు పాలు పోషక విలువలు కల్గి ఉంటాయని, ఆవు పేడను ఇంధనంగా వాడుకోవచ్చన్నారు.

అంతర్జాతీయ రెజ్లింగ్‌ కోచ్‌ మృతి


కృష్ణ(ఫైల్‌)

మణికొండ: నార్సింగి గ్రామస్థాయి నుంచి అంతర్జాతీయ రెజ్లింగ్‌ కోచ్‌ స్థాయికి ఎదిగిన కృష్ణ మృతి చెందారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. నార్సింగి దంగల్‌ కేంద్రంగా ఆయన వేలాది మందికి రెజ్లింగ్‌లో కోచింగ్‌ ఇచ్చారు. జిల్లా రెజ్లింగ్‌ అసోసియేషన్‌కు కార్యదర్శి, అధ్యక్షుడిగా పనిచేశారు. తన వద్ద రెజ్లింగ్‌ నేర్చుకున్న క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించేందుకు ఆయన ఎంతో కృషి చేశారు. జర్మనీలో జరగనున్న అంతర్జాతీయ రెజ్లింగ్‌ పోటీలకు రెఫరీగాను ఎంపికయ్యారు. అంతలోనే అతను మృతి చెందటంతో నార్సింగి గ్రామంలో విషాదం నెలకొంది.

లక్ష్యానికి చేరువలో..

ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్‌

- కొత్త నిర్మాణాలకు పన్ను ముదింపులో ఇబ్బందులు
- వనరులు ఉన్నా పంచాయతీలకు సమకూరని ఆదాయం



పెద్దషాపూర్‌ పంచాయతీ కార్యాలయం

శంషాబాద్‌ రూరల్‌: మండల పరిధిలోని పంచాయతీల్లో ఆస్తి పన్ను వసూళ్లు లక్ష్యానికి చేరువలో ఉన్నాయి. మార్చి చివరి నాటికి వంద శాతం వసూలు లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటి వరకు 74 శాతం వసూలయ్యాయి. మరో పది రోజుల గడవు ఉండగా.. వంద శాతం వసూలు కోసం అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకు ఆయా పంచాయతీల్లో ఆస్తి పన్నుల వసూలు కోసం స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నారు. మండలంలోని కొన్ని పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేశారు. 27 పంచాయతీల్లో 7 పంచాయతీలను విలీనం చేయగా.. కొత్తగా మరో పంచాయతీని ఏర్పాటు చేశారు. దీంతో ప్రస్తుతం మండలంలోని 21 పంచాయతీలు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేసిన బోటిగూడ పంచాయతీకి ఇంకా ఎలాంటి ఆస్తి పన్నులను ముదింపు చేయలేదు. దీంతో 20 పంచాయతీల లెక్కన ఆస్తి పన్నులను వసూలు చేస్తున్నారు.

రూ. 1.86 కోట్లకు పైగా లక్ష్యం..

ఆయా పంచాయతీల్లో ఆస్తి పన్ను మొత్తంగా రూ.1,86,64,628 లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో పాత బకాయిలు రూ.16,78,014 ఉంది. ఇప్పటి వరకు రూ.1,50,82,375 వసూలు చేశారు. పాత బకాయిల్లు ఇప్పటి వరకు రూ.5,26,715 మాత్రమే వసూలయ్యాయి. మొత్తంగా 74 శాతం పన్ను వసూలు కాగా రూ.52,60,267 వసూలు చేయాల్సి ఉంది. సర్పంచుల పదవి కాలం ముగిసి ఏడాది గడవడం.. ప్రత్యేకాధికారుల పాలనతో గ్రామాల్లో అభివృద్ధి పనులు అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. దీంతో జనాలు ఆస్తి పన్నులు చెల్లించడానికి ముందుకు రావడంలేదని సిబ్బంది పేర్కొంటున్నారు.

కొత్త నిర్మాణాల సంగతేంటి?

గ్రామాల్లో కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లకు ఆస్తి పన్ను ముదింపులో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇక్కడ జీఓ 111 పరిధి కారణంగా నిర్మాణాలపై ఆంక్షలు ఉన్నాయి. అయినా సరే గ్రామాల్లో నిర్మాణాలు భారీగా జరుగుతున్నాయి. కొత్తగా నిరిమ్తస్తున్న వాటికి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ఆస్తి పన్ను ముదింపునకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కొత్త నిర్మాణాలు, అదనపు అంతస్తుల నిర్మాణాలకు ఆస్తి పన్ను ముదింపు చేస్తే పంచాయతీలకు మరింత ఆదాయం సమకూరుతుంది. ఈ దిశగా అధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పన్ను చెల్లించని వాణిజ్య సముదాయం సీజ్‌..



అత్తాపూర్‌: ఆస్తిపన్నులు చెల్లించకుండా వాణిజ్య వ్యాపారాలు చేసుకుంటున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్‌ మున్సిపల్‌ ఉప కమిషనర్‌ రవికుమార్‌ తెలిపారు. అత్తాపూర్‌ డివిజన్‌ ఎం.ఎం.పహాడీ తదితర ప్రాంతాల్లో గత కొన్ని సంవత్సరాలుగా మహమ్మద్‌ జావేద్‌ వాణిజ్య వ్యాపారాలు చేసుకుంటూ ప్రభుత్వానికి టాక్స్‌ రూపంలో రూ.12 లక్షల చెల్లించాల్సి ఉంది. ఆస్తి పన్ను సెటిల్‌మెంట్‌లో భాగంగా రూ.12 లక్షలకు రూ.9 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని నోటీసులు కూడా జారీ చేశామన్నారు. ఎంతకీ స్పందించకపోవడంతో బుధవారం సీజ్‌ చేశామన్నారు.

మూగజీవాలకు ఆసుపత్రులు ఉండాలి


మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

మణికొండ: హైదరాబాద్‌ లాంటి మెట్రో నగరంలో పెట్స్‌ను పెంచుకునే వారి సంఖ్య పెరుగుతుందని, వాటికి సరైన వైద్య సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఆదునిక ఆసుపత్రి రావటం సంతోషమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. నగర శివారు నార్సింగి మున్సిపాలిటీ గండిపేట రోడ్డు, కోకాపేటలో బుధవారం రాత్రి ఆయన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఏర్పాటు చేసిన 'పెట్‌ ఫస్ట్‌' మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డి.శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు టి. ప్రకాశ్‌గౌడ్‌, అరికెపూడి గాంధీ, మురళీ నాయక్‌, వివేక్‌ వెంకటస్వామి, రాజేఠాకూర్‌, ఆసుపత్రి ఎండీ పద్మజ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాఫిక్‌ కానిస్టేబుల్‌కు గాయాలు


గాయపడిన కానిస్టేబుల్‌ చందర్‌

మణికొండ: విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తున్న ట్రాఫిక్‌ కానిస్టేబుల్‌ రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. రాయదుర్గం ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న చందర్‌ బుధవారం తన డ్యూటీకి బండ్లగూడ నుంచి వెళ్తుండగా మైహోం అవతార్‌ సమీపంలో ముందు వెళ్తున్న ఆటో ఒక్కసారిగా ఆపటంతో దాని వెనకనే వెళ్తున్న కానిస్టేబుల్‌ ఢీ కొట్టాడు.ఈ ప్రమాదంలో అతని ఎడమ కాలు విరిగింది. గమనించిన స్థానికులు 108లో అతన్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

కోకాపేటలో కారు బీభత్సం


ప్రమాదానికి గురైన కారు

మణికొండ: అతి వేగంగా దూసుకొచ్చిన కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొట్టిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. బుధవారం వేకువజామున ఓ కారు గండిపేట వైపు నుంచి కోకాపేట ఔటర్‌ రింగ్‌ రోడ్డు వెళ్తూ విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొట్టి నిలిచిపోయింది. అందులో ఉన్న ఇద్దరిలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. కారును అక్కడే వదలి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వెళ్లిపోయారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

అత్తాపూర్‌: ఇద్దరు పిల్లలను తీసుకుని గృహిణి అదృశ్యమైన ఘటన అత్తాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ నాగన్న వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌ రాష్ట్రానికి చెందిన షమీ అన్సారీ(25), భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే ఎలివేటెడ్‌ వే 294 పిల్లర్‌ నెంబర్‌ సమీపంలో నివాసముంటున్నారు. తాపీ మేస్త్రీగా పని చేస్తున్న షమీ అన్సారీ మార్చి 15న పనికి వెళ్లి రాత్రికి వచ్చేసరికి భార్య ఇష్రాత్‌బేగం(23), కూతురు సభా బేగం(6), ఐదు నెలల పాప కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విదేశీ విద్యపై అవగాహన అవసరం


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న సంస్థల ప్రతినిధులు

మణికొండ: ఉన్నత చదువుల నిమిత్తం విదేశాలకు వెళ్లే విద్యార్థులు అక్కడి యూనివర్సిటీలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ నర్మద అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని కళాశాలలో బుధవారం నిర్వహించిన గ్లోబల్‌ ఎడ్యుకేషన్‌ సమ్మిట్‌లో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత పరిస్థితిలో విదేశాలలో ఉన్నత విద్య చదివితే మంచి సంస్థలలో ఉద్యోగాలు లభిస్తున్నాయన్నారు. అలాంటి విదేశీ విద్యను విద్యార్థుల దరి చేర్చాలనే ఉద్దేశంతో అనేక విదేశీ సంస్థలను ఇక్కడకే రప్పించి వారి వివరాలను తెలియజేస్తున్నామన్నారు. యూఎస్‌ఏ, యూకే, యూరప్‌, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన 20 ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల ప్రతినిధులను ఒకే చోట చేర్చటంతో తమ విద్యార్థులు వారికి నచ్చిన యూనివర్సిటీలను ఎంచుకునే అవకాశం కలిగిందన్నారు. ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు ఎకోల్‌ డి కామర్స్‌ డి లియోన్‌ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. పరిశోధన, అభివృద్ధి, విద్యార్థుల మార్పిడి, జ్ఞాన భాగస్వామ్యంలో సహకారానికి మార్గం సుగమం చేశామన్నారు. ఈ సమ్మిట్‌లో సైన్‌ ఎడ్యుకేషనల్‌ సర్వీసెస్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఎన్‌.శ్రీనివాస్‌, కళాశాల అకాడమిక్స్‌ డీన్‌ డాక్టర్‌ శివనాగిరెడ్డి, అడ్మిషన్స్‌ డీన్‌ డాక్టర్‌ ఎస్‌. జగదీష్‌, పూర్వ విద్యార్థుల డీన్‌ డాక్టర్‌ కేసీ రవి కుమార్‌, మీడియా, పీఆర్‌ డీన్‌ డాక్టర్‌ నరేంద్రకుమార్‌ పాల్గొన్నారు.

రద్దీ ప్రాంతాల్లో టాయిలెట్స్‌ ఏర్పాటు చేయాలి

శాస్త్రిపురం: బస్టాపులు, ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద పబ్లిక్‌ టాయిలెట్స్‌ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాజేంద్రనగర్‌ సర్కిల్‌ పరిధిలోని అత్తాపూర్‌, శాస్త్రిపురం, చింతల్‌మెట్‌, హైదర్‌గూడ, నానంబర్‌ ప్రాంతాల నుంచి వేలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతాల్లోని బస్టాపులు అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాలు. నగరంతో పాటు శివారు ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వారు వేల సంఖ్యలో ఉంటారు. ఇంత రద్దీగా ఉండే బస్టాప్‌లలో ఎక్కడా పబ్లిక్‌ టాయిలెట్స్‌ లేవు. ఈ ప్రాంతపు వ్యాపారులు, ప్రైవేటు ఉద్యోగులు, ప్రయాణికులు చౌరస్తాకు దూరంగా ఉన్న ఖాళీ ప్రదేశంలో మూత్ర విసర్జన కానిచ్చేస్తున్నారు. గత కొంతకాలంగా ప్రముఖ వ్యాపార కేంద్రంగా ఎదిగిన రాజేంద్రనగర్‌ రోడ్లపై ఎన్నో వ్యాపార సంస్థలు, మాల్స్‌ వెలిశాయి. ఈ ప్రాంతాలలో ఉన్న సేవా కేంద్రాలు, షాపింగ్‌ మాల్స్‌, ప్రైవేటు కార్యాలయాలకు నిత్యం వేలాది మంది వస్తుంటారు. ఈ పరిసరాల్లో కూడా ఎక్కడా పబ్లిక్‌ టాయిలెట్స్‌ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. గ్రీన్‌ టాయిలెట్స్‌, బయోటాయిలెట్స్‌ అంటూ ప్రకటనలు ఇచ్చే బల్దియా అధికారులు కాలయాపన చేస్తున్నారే తప్ప మూత్రశాలల ఏర్పాటులో శ్రద్ధ కనబర్చడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


స్థానికులతో మాట్లాడుతున్న నాయకులు

మణికొండ: కాలనీల్లో ప్రజలకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్‌ పార్టీ కృషి చేస్తుందని ఆ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం అన్నారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బీఆర్‌సీ ఎదురుగా ఉన్న సాయిచంద్ర కాలనీలో గుడ్‌మార్నింగ్‌ మణికొండ కార్యక్రమంలో భాగంగా పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ.. అలకాపూర్‌ టౌన్‌షిప్‌ నుంచి ప్రజలు ఐటీ జోన్‌కు సాయిచంద్ర కాలనీ మీదుగా అధిక సంఖ్యలో రాకపోకలు సాగించటంతో ట్రాఫిక్‌ రద్దీ ఏర్పడుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న లింక్‌ రోడ్డు పనులను పూర్తిచేస్తే సమస్య పరిష్కారమవుతుందన్నారు. అంతవరకు కాలనీలో స్పీడ్‌ బ్రేకర్‌లను ఏర్పాటు చేసి కాలనీలో ఉన్న రెండు పార్కులను అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ధన్‌రాజ్‌, నరేందర్‌, విఠల్‌, శ్రీకాంత్‌, దిలీప్‌, కిరణ్‌, భానుచందర్‌, సుమనళిని పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన బస్తీవాసులు

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ డివిజన్‌ పరిధిలోని హనుమాన్‌నగర్‌ వాసులు గుడిమల్కాపూర్‌ మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ బండారి శంకర్‌ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే ప్రకాశ్‌ గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రకాశ్‌ గౌడ్‌ 40 సంవత్సరాలుగా హనుమాన్‌నగర్‌లో నిరుపేదలు ఇళ్లు నిర్మించుకొని జీవిస్తున్నారని వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ ప్రస్తావించారు. ఈ సందర్భంగా బస్తీ ప్రజలు మాట్లాడుతూ.. నిరుపేదలైన తాము 40 సంవత్సరాలుగా తాత్కాలిక ఇల్లు కట్టుకొని నిసిస్తున్నామని తెలిపారు. ప్రతి ఎన్నికల ముందు ఆయా ప్రభుత్వాలు తమకు హామీలు ఇస్తున్నారు తప్పా.. ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్నారు.ఎమ్మెల్యే ప్రకాశ్‌ గౌడ్‌ తమ సమస్యను అసెంబ్లీ దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం కోసం కృషి చేయడం అభినందనీయమన్నారు.

సన్మానం

రాజేంద్రనగర్‌: రాష్ట్ర ప్రభుత్వం బీసీ 42 శాతం రిజర్వేషన్‌ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించినందుకు మహాత్మా జ్యోతిబా పూలే ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌ గౌడ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కృష్ణమాచారి, డి.సత్యనారాయణ ముదిరాజ్‌, కె.యాదయ్య ముదిరాజ్‌, అన్నయ్య, బండారి శంకర్‌, భిక్షపతి, పూంజాల శ్రీనివాస్‌ గౌడ్‌, కొండల్‌ ముదిరాజ్‌, రాధాకృష్ణ, రామకృష్ణ, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

పార్కులను ఆధునీకరించాలి


అధికారులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్‌లోని పార్కులను ఆదునీకరించాలని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్‌ తోకల శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం కాటేదాన్‌లోని ఆయన కార్యాలయంలో అర్బన్‌ బయోడైవర్సిటీ హార్టికల్చర్‌ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డివిజన్‌ పరిధిలోని పద్మశాలిపురం పార్కు, సారధి యూత్‌ క్లబ్‌ జీహెచ్‌ఎంసీ పార్కు, హనుమాన్‌ దేవాలయం కల్యాణ మండపం పార్కు అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించాలన్నారు. ఎండా కాలం దృష్టిలో ఉంచుకుని తగిన నీటి సౌకర్యం కల్పించాలని పార్కు సుందరీకరణ పనులపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్‌ అర్బన్‌ బయోడైవర్సిటీ రాజేంద్రనగర్‌ సర్కిల్‌ మేనేజర్‌ అశోక్‌, ఫీల్డ్‌ అసిస్టెంట్‌ మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట



మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌

మణికొండ: ఇసుక ధరలను ఇష్టారాజ్యంగా పెంచి అమ్మకాలు చేసి మోసాలకు పాల్పడుతున్న దళారులను అరికట్టి, అవసరమైన వారికి ప్రభుత్వమే ఇసుకను తక్కువ ధరకు అమ్మే వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిందని రాష్ట్ర మినరల్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మెన్‌ అనిల్‌కుమార్‌ అన్నారు. బుధవారం నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలో రాష్ట్ర ముదిరాజ్‌ కార్పొరేషన్‌ చైర్మెన్‌ బి. జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌, గనులు, భూగర్భ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్‌తో కలిసి సాండ్‌ బజార్‌(ఇసుక అమ్మకం కేంద్రం)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరం చుట్టూ ఔటర్‌రింగ్‌ రోడ్డు సమీపంలో ప్రతి 30 కిలో మీటర్లకు ఒక ఇసుక అమ్మకం కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. నిర్మాణదారులు ఎవరైనా ఇసుక కావాలంటే ఆన్‌లైన్‌లో బుక్‌ చేసుకుంటే వారికి అవసరమైన మేరకు ఇసుకను పంపుతామన్నారు. సన్న ఇసుక టన్నుకు రూ.1800, దొడ్డు ఇసుక టన్నుకు రూ. 1600 చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఎండీసీ డైరెక్టర్‌ శశాంక, ఎండీ సుశీల్‌కుమార్‌, ఏడీ నర్సిరెడ్డి, రాజేంద్రనగర్‌ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, గండిపేట తహసీల్దార్‌ ఎస్‌. శ్రీనివాస్‌రెడ్డి, గుడిమల్కాపూర్‌, నార్సింగి మార్కెట్‌ కమిటీ చైర్మెన్లు టి. మల్లేష్‌ముదిరాజ్‌, కె. వేణుగౌడ్‌ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువ డాక్టర్‌ మృతి

రాజేంద్రనగర్‌: రోడ్డు ప్రమాదంలో ఓ యువ డాక్టర్‌ మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ క్యాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం.. కిషన్‌బాగ్‌ ప్రాంతానికి చెందిన మహ్మద్‌ షఫీవుద్దీన్‌ కుమార్తె సోహా ఫాతిమా (23) ఎంబీబీఎస్‌ పూర్తి చేసింది. గచ్చిబౌలిలోని కేర్‌ ఆసుపత్రిలో డాక్టర్‌గా ప్రాక్టీస్‌ చేస్తుంది. బుధవారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై కిషన్‌బాగ్‌, అత్తాపూర్‌ మీదుగా మెహిదీపట్నం వైపు వెళ్తుండగా..పిల్లర్‌ నెంబర్‌ 163 వద్ద ఫాతిమా నడుపుతున్న వాహనాన్ని ఫైరింజన్‌ వాహనం ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఈ సంఘటనలో వాహనం వెనుకా చక్రాల కింద పడిన ఫాతిమా అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్‌ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ క్యాస్ట్రో తెలిపారు.

'పది' పరీక్ష కేంద్రాల పరిశీలన


హైదర్షాకోట్‌లోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న శరత్‌చంద్ర

బండ్లగూడ: పది పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు ఏర్పాట్లు చేశామని బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ బి.శరత్‌చంద్ర సూచించారు. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న పది పరీక్ష కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. జిల్లా పరిషత్‌ హై స్కూల్‌, భవాని మోడల్‌ స్కూల్‌, గౌతం మోడల్‌ స్కూల్‌, ఎస్‌ఎంపీ మోడల్‌ స్కూల్‌, ఎల్‌ఎస్‌ఆర్‌ కాన్సెప్ట్‌ స్కూల్‌లలోని ఫర్నీచర్లు, కాంపౌండ్‌ వాల్స్‌, విద్యుత్‌, తాగునీరు, సీసీ కెమెరాలను పరిశీలించి మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా అన్ని ఏర్పాటు చేశామన్నారు.

హరిత నిర్మాణాలపై దృష్టి సారించాలి


'ఎస్కీ'లో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: నిర్మాణ రంగంలో స్థిరమైన ఆవిష్కరణలకు గ్రీన్‌ బిల్డింగ్స్‌ ఆవశ్యకత ఉందని ఇండియన్‌ జియోటెక్నికల్‌ సొసైటీ అధ్యక్షుడు, ఇనిస్టిట్యూషన్‌ ఆఫ్‌ ఇంజినీర్స్‌ ఇండియా జాతీయ మండలి సభ్యుడు డాక్టర్‌ అనీల్‌ జోసెఫ్‌ అన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్‌ స్టాఫ్‌ కాలేజ్‌లో 'సివిల్‌ ఇంజినీరింగ్‌లో నూతన టెక్నాలజీని ఉపయోగించుకుని స్థిరంగా ఉండే గ్రీన్‌ బిల్డింగ్స్‌ నిర్మాణాల ఆవశ్యకత' అంశంపై వర్క్‌షాప్‌ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణంలో వెలుతురుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. భారత దేశం మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగల దేశంగా అవతరించబోతున్నదని దేవశ్రీ ఇస్పాత్‌ స్టీల్‌ ప్రొడక్ట్స్‌ అధినేత రాజీవ్‌బిష్త్‌ అన్నారు. సివిల్‌ ఇంజనీరింగ్‌లో వస్తున్న నూతన మార్పులతో దేశంలో గ్రీన్‌ బిల్డింగ్స్‌ నిర్మాణాల ఆవశ్యకత ఉందని, పర్యావరణ పరిరక్షణకు హరిత నిర్మాణాలు అవసరమన్నారు. ఎస్కీ డైరెక్టర్‌ డాక్టర్‌ జి రామేశ్వరరావు మాట్లాడుతూ గ్లోబల్‌ వార్మింగ్‌ కారణంగా ఏర్పడుతున్న ప్రమాదాలను తగ్గించుకోవడంపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో సివిల్‌ ఇంజనీర్లు, ఆర్కిటెక్టు నిపుణులు, వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.